## సింగిల్ పేజీ కథలు

# తల్లిదండ్రుల ప్రేమ

**బట్టల షాప్‌లో చీరలకి మేచింగ్ బ్లవుజెస్ కొని వస్తూ ఉంటే "అమ్మా రిక్షా కావాలా" అని రిక్షా వాళ్లు వెనుక పడ్డారు. "రిక్షా వద్దయ్యా, కారు ఉంది" అని చెప్పి ముందుకి వెళ్లి కారు ఎక్కాను.**

కారులో కూర్చొని ''సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడికి పోనియ్'' అని డ్రైవర్‌తో చెప్పాక అనిపించింది. 'రిక్షావాళ్లకి రిక్షా వద్దు' అని చెపితే చాలు



కదా. కారు ఉంది అని చెప్పక్కర్లేదుగా.

కారు గుడి ముందు ఆగబోతుంటే, ఇంచుమించుగా మా కారుని డేష్ కొట్టేంత వేగంగా ఒక కొత్త ఆటోరిక్షా వచ్చి కారు ముందు ఆగింది.

ఆ ఆటో వెనుక భాగంలో 'తల్లిదండ్రుల ప్రేమ'తో అని చక్కని అక్షరాలు రాసున్నాయి. అవి చూడగానే నా మనసుని ఆకట్టుకున్నాయి. ఆ అక్షరాల అందాన్ని, అర్థాన్ని మనసుతో వెతుకుతూ వుంటే-

''ఏయ్! బ్రతకాలని లేదా'' అన్న మా డ్రైవర్ అరుపు- ''సార్, సార్ క్షమించండి. క్రొత్త ఆటో కొన్న ఉత్సాహంతో ఉన్నాను'' అన్న ఆటో డ్రైవర్ సంజాయిషీ వినపడ్డాయి.

సరే ఇది నా విషయం కాదు అని నేను కారు దిగి కోవెల్లోకి వెళ్లి స్వామి దర్శనం చేసుకొని వచ్చేసరికి కొత్త ఆటో ముందు పూజారిగారు కొబ్బరికాయ కొట్టి హారతి ఇస్తున్నారు.

ఆటో అతను సడన్‌గా నా వేపు తిరిగి ''కొత్త ఆటో మేడమ్ హారతి ఇవ్వగానే కనిపించారు మేడమ్. ఎక్కడికో చెప్పండి డ్రాప్ చేస్తాను'' అన్నాడు. నాకు ఎందుకో ఇందాక రిక్షావాళ్లకి చెప్పినట్లు 'నో' అని చెప్పాలనిపించలేదు. కారు డ్రైవర్‌కి ఆటో వెనకాల రమ్మని చేత్తో సైగ చేసి ఆటో ఎక్కి ఇంటికి ఎటు పోవాలో చెప్పాను.

''ఎంత ఇమ్మంటావేంటి'' అన్న నా మాటలకి అతను అతి ఉత్సాహంగా ఆటో స్టార్ట్ చేస్తూ ''మీ ఇష్టం మేడమ్. కొత్త ఆటో, మిమ్మల్నే నేను మొదట ఆటో ఎక్కించుకొన్నది'' అన్నాడు.

అతను ఎంత ఉత్సాహంగా ఉన్నాడంటే, మాట్లాడించకుండానే అన్నీ మాట్లాడేస్తున్నాడు.

వాళ్ల నాన్నది చిన్న కంపెనీలో ఉద్యోగంట. రిటైరయినాక కంపెనీ వాళ్లు ఇచ్చిన సొమ్ము అంతా ఇతనికే ఇచ్చి ఆటో కొనుక్కోమన్నాడట. అంతేకాకుండా చిన్నప్పటి నుంచి ప్రేమతో, మంచి అలవాట్లతో పెంచారుట. అందుకే ''అమ్మగారూ, 'తల్లిదండ్రుల ప్రేమతో' అని ఆటో మీద రాయించుకున్నాను'' అన్నాడు.

అతను ఇదంతా చెప్పేసరికి మా ఇల్లు వచ్చింది. నేను దిగుతోంటే, మా కారు మా ఇంటి ముందుకు వచ్చి ఆటో ముందు ఆగింది. నేను ఇచ్చే డబ్బులు పుచ్చుకోకుండా ఆటో డ్రైవర్ మా కారు డ్రైవర్‌తో ''ఏంటి గురువుగారూ ఇందాక నాకు బుద్ధి చెప్పి మీరు చేసిన పని'' అంటున్నాడు. ''సర్లేవయ్యా ఇది మా అమ్మగారి ఇల్లే. కారు వారిదే'' అన్నాడు మా డ్రైవర్.

ఈసారి ఆటో అతను నాకేసి తిరిగి ''థాంక్స్ మేడమ్. దేవతలాగా నా ఆటో ఎక్కారు. ఈ ఆటోమీద వచ్చిన సొమ్ముతో మా అమ్మా నాన్నని పోషించుకోవాలి. నేను హాయిగా బ్రతకాలి'' డబ్బులు తీసుకొని సెల్యూట్ చేసి వెళ్లిపోయాడు.

ఒకరోజు నేను, మా శ్రీవారు కంబాల చెరువు దగ్గర పార్కులో వాకింగ్ చేసి బయటకు వస్తూంటే ''ఆటో కావాలమ్మా'' అనే మాటలు వినిపించాయి. ''వద్దయ్యా, వాకింగ్‌కి వచ్చాము'' అని మనసులో మాత్రం 'వద్దయ్యా అంటే చాలుగా, వాకింగ్‌కి వచ్చాం అని ఆటోవాలాతో చెప్పక్కర్లేదుగా' అనుకొంటూ ఉండగానే ''మీరా, అమ్మా'' అని ఆటో అతని మాటలు వినిపించాయి.

ఆ మాటలకి నేను అతనివైపు తిరిగి ఎవరా అని గుర్తు చేసుకొనే అంతలోనే ''సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి దగ్గర మీకు కారు ఉన్నా నా కొత్త ఆటో ఎక్కారు'' ఈసారి అతని మాటలు పూర్తి కాకుండా నేనే అన్నాను ''ఏమిటి బాగా చిక్కిపోయావ్. గెడ్డం పెంచావ్'' అన్న నా మాటలకి అతను నీరసంగా నవ్వి ''రండి సారూ నా ఆటో ఎక్కండి అన్నాడు'' మా వారితో.

ఆటో ఎక్కేలోగా మా శ్రీవారితో మూడు నెలల క్రితం అతని కొత్త ఆటో ఎక్కిన వైనం వివరించాను.

ఇద్దరం ఆటో ఎక్కాము. ఆటో స్టార్ట్ చేస్తూ ''నాకు ఈమధ్యనే పెళ్లయింది సార్'' అన్నాడు.

అదన్న మాట సంగతి. ఆటో వెనకాల పేరు మారిపోయింది. 'వీరబాబు, వీరలక్ష్మి' అని. ''మరింకేం సంతోషంగా ఉండక'' అని నేను అనబోతుంటే ''హుష్.. చెప్పనీ అతన్ని'' అన్నారు మా వారు.

''ఏముంది సార్! పెళ్లయిన మొదటివారంలో

మా బావమరిది మా ఇంటికొచ్చాడు. ఆడు వచ్చిన రోజున నా ఆటోకి ఏక్సిడెంట్ అయింది. ఆ చికాకులో నా పెళ్లాం ఏమన్నా విసుక్కున్నాను. ఆడు ఉన్న రెండురోజులు ఏక్సిడెంట్ గొడవల్లో మా బావమరిదితో సరిగ్గా మాట్లాడలేదు. ఆడు వెళ్లిన మరుసటి రోజు మా అన్నకు గవర్నమెంటు ఉద్యోగం. ఆడు గొప్పోడు అని నీకు కుళ్లు అంటూ మొదలుపెట్టింది. నేనూ ఊరుకోలేదు. అలా మొదలైన మా గొడవ మా వాళ్లకు నువ్వు మర్యాద ఇయ్యలేదు. నేను ఎందుకు ఇవ్వాలి అంటూ ఆటో వెనకాల పేర్లు మార్చే వరకూ అది కుదుటపడలేదు. నన్ను పడనివ్వలేదు.''

ఈసారి మా వారు అన్నారు ''మరి ఏక్సిడెంట్ విషయం చెప్పలేదా'' అని.

''చెప్పానండి. దాని కోపం తగ్గల్లేదు'' అని అతను అంటూ ఉండగానే మా ఇల్లు వచ్చింది. అతను డబ్బులు తీసుకొంటూ ఉండగానే మొత్తానికి 'తల్లిదండ్రుల ప్రేమతో' అని ఆటో వెనకాల రాతని- అని నేను అంటూ ఉండగానే కళ్లల్లో నీళ్లతో అతను వెళ్లిపోయాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకి మా మనవరాలు పుట్టిన రోజుకి విశాఖ వెళ్లి జన్మభూమికి తిరిగి రాజమండ్రి చేరుకున్నాం నేను ఈయన! ఉదయం పది గంటలకే ఎండ మండిపోతోంది ''బాగున్నారా సార్, మేడమ్ మీరూ చిక్కారు ఏమిటి'' అంటూ హుషారుగా మా వారి చేతిలోని సూట్‌కేస్ తీసుకొంటున్న అతన్ని చూసి మేము ఈసారి ఈజీగానే గుర్తుపట్టాము. సుబ్రహ్మణ్యేశ్వర గుడి దగ్గర పరిచయమైన ఆ ఆటో డ్రైవర్ చాలా హుషారుగా, ఇదివరకటి కంటే ఆరోగ్యంగా ఉన్నాడు. చాలా హుషారుగా అతనే మాటలాడడం మొదలు పెట్టాడు.

''ఒకరోజు మా ఆవిడతో అన్నాను. ఏంటోనే మన ఇద్దరి పేర్లమీద ఆటో నడుపుతూ ఉంటే అట్టే బేరాలు రావట్లేదు. ఆ ఏడుకొండలాడి పేరు పెడతామేంటి అని, మా ఆవిడ 'ఊ' అనగానే ఆటో వెనకాల పేర్లు మార్చేశాను. మా అమ్మ పేరు మంగమ్మ. మా నాన్న పేరు వెంకన్న సార్. ఏ పేర్లతో పిలుచుకున్నా వాళ్లు మనకు దేవతలే కదా సార్''.

ఇల్లు రాగానే ఆటో దిగబోతూ కుతూహలంగా ఆటో వెనకాతలకెళ్లి పేర్లు చదివాము. ''శ్రీనివాస్ - పద్మావతి''. ఆటోకి డబ్బులిస్తూ ఆశీర్వచనంలా అతని భుజం తట్టారు మా వారు.

**-కె. రత్నమాల (రాజమండ్రి)**

# అర్థాలే వేరులే

**అది ఒక ప్రభుత్వ కార్యాలయం.**

''ఏమోయ్ రికార్డ్‌లో ఒక ముఖ్యమైన ఫైలు కావాలి. రికార్డ్ రూమ్‌కి వెళ్లి 211/93 పాత ఫైలు వెతికి పట్టుకురా'' అన్నారు ఆఫీసరుగారు రికార్డ్ అసిస్టెంటు సుబ్బారావుతో. ఆ ఆఫీసులో ఇంకా కంప్యూటర్స్ రాలేదు.

సుబ్బారావు అదోలా ముఖం పెట్టి ''ఎక్స్క్యూజ్‌మీ సర్. నాకు రికార్డ్ రూమ్‌కి వెళ్తే ఆ దుమ్ముకి ఎలర్జీ అండీ. ఒకటే తుమ్ములు వచ్చేస్తాయి. ఇంకెవరికైనా చెప్పండి'' అన్నాడు.

మనం ఎవరికైనా పని చెప్తే వాళ్లు అడ్డం తిరిగి మాట్లాడితే ఒకే కోపం వస్తుంది.

''అదేంటయ్యా ఎప్పుడు రికార్డ్‌రూమ్‌లోకి వెళ్లమన్నా ఎలర్జీ అంటావ్. నీకు ఇష్టం లేకపోతే ఆ పని చెయ్యను అని చెప్పు. అంతేగాని ఏదో సాకు చెప్పొద్దు. అయినా నీకు బద్ధకం ఎక్కువై పోయిందీ మధ్యన'' అన్నాడాయన.

''అదికాదు సర్. ఈ విషయం మీకు ఎన్నో సార్లు చెప్పాను.'' ఆయన అతని మాటలకు అడ్డు వచ్చి ''నో మోర్ ఆర్గ్యుమెంట్స్'' అంటూ ఇంకొకతనికి ఆ పని చెప్పాను.

చాలా కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన సదరు ఫైలు గురించి ఈ రోజు హైదరాబాద్ నుంచి బాస్ వస్తున్నాడు. ఆయనతో మాట్లాడి ఆ ఫైలు పరిష్కారం చేయాలి..

ఇలా ఆలోచిస్తుండగానే, బాస్ కారు రావడం ఆయన ఆఫీసరుగారి రూమ్‌లో ప్రవేశించడం ఒక్కసారే జరిగిపోయింది.

''ఏమండీ ఫైలు తీయించారా?'' అన్నారాయన లోపలకు వస్తూనే.

''క్షణంలో వచ్చేస్తాయండీ ఆ ఫైల్సన్నీ. రికార్డ్‌లో వెదికిస్తున్నాను.'' అని ఆఫీసరుగారు అన్నారో లేదో బాస్ ఫైరయిపోయి ''చాల్లెండి...పదండి'' అంటూ రికార్డ్ రూమ్‌లోకి చకచకా వెళ్తుంటే ఆయన్ను అనుసరించారు ఆఫీసరుగారు.

రికార్డ్ రూమ్ ఫైల్సన్నీ వెదుకుతున్నారు సిబ్బంది. అక్కడ దుమ్ము లేస్తోంది.



అంతే బాస్‌కి తుమ్ములు మొదలయ్యాయి. ఒకటి, మూడు, తొమ్మిది అలా తుమ్ముతూనే ఉన్నారాయన. ''పదండి సర్ మనవాళ్లు ఫైల్స్ తెస్తారు'' అంటూ తుమ్ముతున్న బాస్‌ను ఆఫీసరు గారు తన గదిలోకి తీసుకు వెళ్లి కూర్చోపెట్టారు. బాస్ ముఖం ఎర్రగా కందిపోయింది. ఆయన ముక్కు దొండపండులా అయిపోయింది.

''నాకు అసలే డస్ట్ ఎలర్జీ. ఎవిల్ టాబ్లెట్స్ తెప్పించండి ఎవరి చేతనైనా. ఆ ఫైల్స్ దులిపించండి బాగా. నేను గెస్ట్‌హౌస్‌కి వెళ్తాను. డిస్కషన్స్ మధ్యాహ్నం పెట్టుకుందాం'' అని అంటూండగానే బాస్ వెళ్లిపోయాడు.

''అయ్యో మీరు ఎందుకు వెళ్లారు సర్ అలర్జీ ఉన్నప్పుడు. జాగ్రత్తగా ఉండాలి కదా'' అంటున్నారు ఆఫీసరుగారు ఆయనతో కారు దాకా వెళ్తూ.

ఆఫీసరుగారి వెనకాలే ఉన్న రికార్డ్ అసిస్టెంట్ సుబ్బారావు ''రికార్డ్ రూమ్‌లోకి వెళ్తే తుమ్ములొస్తాయంటే ఆఫీసర్‌కైతే డస్ట్ ఎలర్జీ, గుమాస్తాకైతే బద్ధకం అని అర్థం అన్నమాట'' అనుకుంటూ ముక్కుకు జేబురుమాలు అడ్డం పెట్టుకున్నాడు ఆ తుమ్ములు తనకు అంటుకోకుండా.

**-కె. బి. కృష్ణ (కాకినాడ)**